అన్నదాతకు కష్టకాలం

- పెరిగిన పచ్చిరొట్ట విత్తనాల ధరలు
- సబ్సిడీ పెంచని ప్రభుత్వం
- అరకొరగా పంపిణీ
- రైతులపై అదనపు భారం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు సుబ్బరాయుడు. దుత్తలూరు మండలం బండగానిపల్లి గ్రామం. ఈయనకు ఐదెకరాల పొలం ఉంది. ఈ భూమిలో ఏటా పచ్చిరొట్ట పైర్లు పిల్లి పెసర, జనుము సాగుచేస్తారు. సుమారు 100 కేజీలు అవసరం అవుతాయి. బయట మార్కెట్లో జనుములు కేజీ రూ.100, పిల్లి పెసర్లు రూ.150 కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా విత్తనాలు అందజేస్తే కొంత భారం తగ్గుతుంది. కానీ ఇంతవరకు ఇవ్వలేదు.దీంతో బయటకొనాల్సిన పరిస్థితి నెలకొంది.



ఈ చిత్రంలో కనిపించే రైతు పేరు ఖాసీం. వరికుంటపాడు మండలం తూర్పుబోయమడుగుల.ఇతనికి 3 ఎకరాలు వరి పండే మాగాణి భూమి ఉంది.ప్రస్తుతం దోస సాగులో ఉంది.వచ్చే సెప్టెంబరులో ఇదే భూమిలో వరి నాటుతాము.దీనికి ముందు సత్తువ పైరుగా జనుము,జీలగ పచ్చిరొట్ట పైరు సాగు చేస్తాము.గత ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల వద్ద సబ్సిడీ విత్తనాలు ఇచ్చారు.ఈ ఏడాది ముందుగానే పేరు రాయించుకొని,డబ్బులు కడితే ఇస్తామని చెబుతున్నారు.అవి కూడ ఎప్పుడు ఇస్తారో ఖచ్చితంగా చెప్పడం లేదు.



సాగులోని పచ్చిరొట్ట పైరు

ఉదయగిరి : జిల్లాలో వ్యవసాయం నమ్ముకున్న అన్నదాతలకు ఏటా సాగు ఖర్చులు ఏదో ఒకరకంగా పెరిగి సాగు భారంగా మారుతోంది. ఒక పక్క పెరిగిన ఎరువులు ధరలు, మరోవైపు విత్తనాల ధరలతో రైతులు సతమతమవుతున్నారు. రైతులు పంటలు వేసేముందుగా భూసారం పెంచే పచ్చిరొట్ట పైర్లు అయిన జీలుగ, జనుము, పిల్లిపెసరను సాగు చేస్తారు. దీంతో భూసారం పెరగడంతో పాటు నేల స్వభావం మెరుగుపడి మంచిదిగుబడులు వస్తాయనే నమ్మకంతో ఎక్కువ మంది రైతులు పచ్చిరొట్టపైర్ల సాగు వైపు ఆసక్తి చూపుతారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం రైతులకు భారం లేకుండా రాయితీని పెంచి పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాల ధరలు పెంచి సబ్సిడీ తగ్గించింది.దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వం అందించే సబ్సిడీ ధరలకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడం రైతులకు భారంగా మారింది.

అరకొరగా విత్తనాల పంపిణీ

ప్రస్తుతం జిల్లాలో నీటి ఆధారంగా పంటలు సాగు చేసే రైతులు భూసారం పెంచుకునేందుకు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసేందుకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు.వర్షాలు పడిన వెంటనే పచ్చిరొట్ట పైర్లు సాగు చేపడతారు. ప్రస్తుతం ప్రభుత్వం అరకొరగా విత్తనాలు సరఫరా చేస్తోంది.పైగా విత్తనాలు అవసరమైన రైతులు తమ పేర్లు నమోదు చేయించుకుని నగదు చెల్లిస్తేనే వారికి మాత్రమే సరఫరా చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విషయంపై అవగాహన లేక చాలా మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేవలం సబ్సిడీ ద్వారా పొందే రైతుల సంఖ్యను తగ్గించే నిమిత్తం ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లుగా అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 50 శాతం రాయితీపై విత్తనాలను అందజేస్తున్నట్లుగా చెబుతున్నా, గతంలో కంటే విత్తనాల ధరలను బాగా పెంచారు. దీంతో పచ్చిరొట్ట విత్తనాలు భారంగా మారాయి. గతేడాది 10కేజీల పిల్లిపెసర్లు ధర రూ.670 ఉంటే, ఈ ఏడాది రూ.900కు పెంచారు. అదే విధంగా పది కేజీల జనుములను రూ.440 నుంచి రూ.610, జీలగలు రూ.440 నుంచి రూ.540కు పెంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా గతేడాది రైతులకు ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ నగదు రూ.20వేలు ఇవ్వలేదు. రెండో ఏడాది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ నేపథ్యంలో పచ్చిరొట్ట విత్తనాల ధరలను సైతం ప్రభుత్వం పెంచడంతో రైతులపై మరింత ఆర్థిక భారం పెరిగింది.

విత్తనాల రకం	ధరలు	
	2024	2025
పిల్లిపెసర్లు	రూ.670	రూ.900
జనుములు	రూ.440	రూ.610
జీలుగలు	రూ.440	రూ.540

రైతుల అవసరాల మేరకు సరఫరా

రైతుల అవసరాల మేరకు పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తాం.ఈ ఏడాది ముందుగానే అవసరమైన రైతుల చేత రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాం.జిల్లాలో మండలవారీగా 1242.9 క్వింటాళ్లు పంపిణీ లక్ష్యం కాగా, ఇప్పుటి వరకు 736.5 క్వింటాళ్లకు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 268.4 క్వింటాళ్లకు నగదు చెల్లించారు. అందులో 46.4 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేయడం జరిగింది.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారిణి

క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి డాక్టరేట్



సంగం : మండలంలోని మర్రిపాడు జెడ్పీఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఆయన ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్ పర్యవేక్షణలో సామాజిక శాస్త్ర విభాగంలో 'ప్రాణం నిలిపే ఆరోగ్య విద్య, అవయవదానం – నెల్లూరు జిల్లా స్థితిగతులు' అనే అంశంపై పరిశోధనలు సాగించి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇందుకుగానూ ఎస్వీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజమాణిక్యం చేతుల మీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

లైన్‌ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



సంగం: సంగం విద్యుత్ శాఖ లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా జీ నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చిరెడ్డిపాళెంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది సంగానికి వచ్చారు. ఏఈ మన్మధరావుకు జాయినింగ్ రిపోర్టును అందజేశారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయ ప్రాంగణం, మెయిన్ బజారులోని సాయిబాబా మందిరాల్లో ఈ నెల 10వ తేదీన గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. శివాలయ ప్రాంగణంలోని సాయిబాబా మందిరంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, కాకడ హారతి, 7.30 గంటలకు భక్తులతో స్వయంగా అభిషేకం, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

ఉదయగిరిరూరల్: పట్టణంలోని బీసీ కాలనీలోని సాయిబాబా మందిరంలో ఈ నెల 10న గురుపౌర్ణమి సందర్భంగా అన్నప్రసాద వితరన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వేయి కేజీలు బియ్యాన్ని శనివారం వితరణ చేశారు. ప్రత్యేక వాహనం ద్వారా బియ్యాన్ని ఆలయ నిర్వాహకులకు పంపారు.

ఈఈ ధర్నా



ఆత్మకూరురూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చేపడుతున్న ధర్నా రెండో రోజు శనివారం కూడా కొనసాగింది. డిపో కార్యదర్శి మేకపాటి చిన్నారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ అండగా నిలుస్తుందన్నారు.

పచ్చని చెట్లపై వేటు



ఉదయగిరి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణంలో ఏళ్ల తరబడి ఉన్న వేపచెట్లను అధికారులు నరికివేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఆధునీకరణ పేరుతో చెట్లను నరకడంతో ఆ ప్రాంతమంతా బోసిపోయింది. కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే కార్యార్థులకు ఏళ్ల తరబడి నీడను ఇస్తున్న చెట్లను నరికేయడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం అనుమతులు లేకుండా చెట్లు నరకడం నేరం. అయినప్పటికీ అధికారులే చెట్లు నరికివేయించడం వివాదస్పదంగా మారింది. చెట్లు నరకకుండా ఆధునీకరణ పనులు చేపడితే బాగుండేదని పలువురు అంటున్నారు. ఇప్పుడు ఉన్న మాదిరిగా చెట్లను పెంచాలంటే మరో పదేళ్ల పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంపీ నిధుల కేటాయింపు

ఉదయగిరి రూరల్: పట్టణంలోని దిలార్‌బావి వీధిలో విద్యుత్ లైన్ మరమ్మతులకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన ఎంపీ నిధుల నుంచి రూ.7లక్షలు మంజూరు చేశారు. ఈ ప్రాంతంలోని విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి తరచూ కూలిపోతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు ఎంపీ వేమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన ఎంపీ నిధులు కేటాయించారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరులోని హరహరపుత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. అర్చకుడు అభిషేక్‌శర్మ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల నుంచి అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కరకల మాలకొండారెడ్డి, కమిటీ సభ్యులు వసంతరావు, కొండా సుధీర్, వెలుగోటి కృష్ణ, శ్రీనివాసరెడ్డి, వినయ్‌రెడ్డి, పాల్గొన్నారు

వైభవంగా మౌలాలీ ఉత్సవం



అల్లూరు: మండల కేంద్రమైన అల్లూరులో జరుగుతున్న మొహర్రం వేడుకల్లో భాగంగా 8వ రోజైన శనివారం మౌలాలీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మౌలాలీ దర్గా వద్ద నుంచి ప్రారంభమైన ఉత్సవం పుర వీధుల్లో సాగింది. తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన మౌలాలీ సేరా వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి మౌలాలీ దర్గా, పీర్ల చావడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాగా 9వ రోజు శనివారం రాత్రి అగ్నిగుండం తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

గోకులం షెడ్లు, సీసీరోడ్లకు బిల్లులు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి పంచాయతీ రాజ్ సబ్‌డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీరోడ్లు, గోకులం షెడ్లకు ప్రభుత్వం బిల్లులను విడుదల చేసినట్లు పంచాయతీరాజ్ డీఈ మణికుమార్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి మండలానికి రూ.1.29 కోట్లు, సీతారామపురానికి రూ.58 లక్షలు, దుత్తలూరుకు రూ.99 లక్షలు, వరికుంటపాడుకు రూ.92 లక్షలు, వింజమూరుకు రూ.47 లక్షలు, కలిగిరికి రూ.1.59 కోట్లు, కొండాపురానికి రూ.84లక్షలు, జలదంకికి రూ.1.10 కోట్లు వంతున పెండింగ్ బిల్లులను కాంట్రాక్టర్ల ఖాతాలో జమచేసినట్లుగా వివరించారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఆత్మకూరు: తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘ నాయకులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలను పెంచాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ జూలై 14వ తేదీ వరకు దశలవారీగా ఆందోళనలు చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులకు నెలకు రూ.21వేల నుంచి ఆయా కేటగిరిలను బట్టి రూ.24,500 వరకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పాఠశాల స్వీపర్లు, వాచ్‌మెన్లకు కనీస వేతనం రూ.21వేలు అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జే నాగరాజు, బీ హజరత్తయ్య, ఎం పెంచలయ్య, రఫీ, సుభాన్, వెంకటేశ్వర్లు ప్రకాష్, నాగార్జున, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లతో కేసులు సత్వరమే పరిష్కారం



ఆత్మకూరు కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ గాయత్రి తెలిపారు. ఆత్మకూరు కోర్టులో జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్‌కుమార్‌తో కలిసి గాయత్రి 153 కేసులను పరిష్కరించారు. అందులో ఐదు సివిల్, 77 క్రిమినల్, 50 బ్యాంకు, 21 బీఎస్ఎన్ఎల్ కేసులు ఉన్నాయి. రూ.33, 80,114 నగదును బాధితులకు అందజేశారు. లోక్‌అదాలత్ సభ్యులు ఏ తిరుపతమ్మ, కే కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెన్నా బ్యారేజ్ వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



సంగం: స్థానిక పెన్నా నది, బ్యారేజీల వద్ద ఇరిగేషన్ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి నెల్లూరులో రొట్టెల పండగ ప్రారంభం కానుండడంతో మండల రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. రొట్టెల పండుగకు వచ్చే యాత్రికులు తిరుగు ప్రయాణంలో పెన్నా బ్యారేజీని సందర్శిస్తారు. అక్కడే సేద తీరి తమ సొంత ఊర్లకు బయలుదేరుతారు. ఈ క్రమంలో బ్యారేజీ వద్ద ఈత సరదాలకు పెన్నా నదిలోకి దిగకుండా అధికారులు చుట్టుపక్కల ప్రాంతాలను ముళ్లకంపతో మూసివేశారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



కరటంపాడు జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు సత్కారం

ఆత్మకూరురూరల్: మండలంలోని పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. బోయలచిరివెళ్ల ఎంపీయూపీ పాఠశాలకు చెందిన ఆర్ వెంకటేశ్వర్లు, కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పెంచలరెడ్డితో పాటు మరో ఏడుగురు ఉపాధ్యాయులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. హెచ్‌ఎం మాలకొండలరావు, గార్లపాటి ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్‌నాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించాలి

విజమూరు(ఉదయగిరి): బీఎల్వోలు ఓటరు జాబితాలోని తప్పొప్పులను సరిచేసి పారదర్శకంగా రూపొందించాలని తహసీల్దార్ ఎస్‌కే హమీద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలకు శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు తమ విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనల మేరకు విధులు నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాలో మృతులు, ఊరులో లేని వారి పేర్లు ఉంటే నోటీసులు జారీ చేసి తొలగించాలన్నారు. బీఎల్వోలు ఉద్దేశపూర్వంగా తప్పులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రైనింగ్ మాస్టర్లు సలీం, మోహన్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా జయంతి వేడుకలు

సంగం: మండలంలోని దువ్వూరులో వంగవీటి మోహన్‌రంగా 78వ జయంతి వేడుకలను యువత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వంగవీటి చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు.




టీడీపీ క్యాడర్‌పై మంత్రి ఆనం అసహనం

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో టీడీపీ క్యాడర్ ప్రజలకు ముఖం చూపించడం లేదు. దీంతో ఆత్మకూరులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో నాలుగురోజుల్లో కేవలం 1470 ఇళ్లను మాత్రమే సందర్శించినట్లుగా సమాచారం ఉందని, ఇది సిగ్గుచేటు అని పార్టీ క్యాడర్‌పై అసహనం వ్యక్తం చేశారు.

భూపట్టాల పంపిణీ

దగదర్తి: మండలంలోని వెలుపోడులో భూమి లేని పేదలకు ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి భూపట్టాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వెలుపోడులోని భూమిలేని నిరుపేదలు 238 మందికి సర్వేనంబర్ 120, 124లో సుమారు 238 ఎకరాలను కేటాయిస్తూ పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వారికి ఇప్పటి వరకు హద్దులను చూపించలేదన్నారు. ప్రస్తుతం పట్టాలు మంజూరు చేసిన వారందరికి భూములకు హద్దులు చూపిస్తామని తెలిపారు. గ్రామంలో మిగిలి ఉన్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి



కృపానందం (ఫైల్)

ఉదయగిరి/వరికుంటపాడు: వరికుంటపాడు సమీపంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో శుక్రవారం రాత్రి బైక్ అదుపుతప్పిన ఘటనలో తీవ్రంగా గాయపడిన తాళ్లూరు కృపానందం అలియాస్ చిన్నా(22) మృతి చెందారు. దుత్తలూరు మండలం కొత్తపేటకు చెందిన కృపానందం,బర్రె రవి పామూరు వెళ్లి తిరిగి వస్తుండగా వరికుంటపాడు సమీపంలో బైక్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కృషానందం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తున్న క్రమంలో బుచ్చిరెడ్డిపాళెం సమీపంలో ప్రాణాలు విడిచారు. దీంతో మృతుడి స్వగ్రామం కొత్తపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. వరికుంటపాడు ఎస్సై రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు స్టౌలు, కుక్కర్ల పంపిణీ

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టౌలు, కుక్కర్లను మంత్రి ఆనం చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నిత్యం తాగునీరు అందేలా మంచినీటి పథకానికి త్వరలో మరమ్మతులు చేయిస్తామన్నారు. ఆత్మకూరులో రూ.22 కోట్ల వ్యయంతో సిమెంట రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ పీ పద్మజాకుమారి, మున్సిపల్ కమిషనర్ సీ గంగాధర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యకు భవిష్యత్



కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపకులపతి జయలక్ష్మి

- ఉపకులపతి ఆర్ శారదజయలక్ష్మి

ఉదయగిరి: వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదజయలక్ష్మి అన్నారు. స్థానిక మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాలలో శనివారం జరిగిన వార్షికోత్సవ సభలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు వీలైనంత వరకు సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించి విద్యా రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల కార్యకలాపాల, ఆరోగ్య, క్రీడల కేంద్రాలను ఆమె ప్రారంభించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ జీ కృష్ణారెడ్డి, అధ్యాపక సిబ్బంది గోపీకృష్ణ, దుర్గాప్రసాద్, రమేష్, కిషన్ తేజ, చెరుకూరి శ్రీనివాసరావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



సీతారామపురంలో పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు



చేజర్లలో పీర్ల ఊరేగింపు



ఆత్మకూరు: ఎల్‌ఆర్‌పల్లి మసీదు వద్ద అన్నదానం

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేట నడుమ ఉన్న జెండా చెట్టు మసీదు వద్ద మొహర్రం వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదులో పీర్లను నిలిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దల పేర్లు చెప్పుకుంటూ సాంబ్రాని వేశారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లారు ఆదిశేషయ్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చేజర్ల(ఆత్మకూరు): చేజర్లలోని దర్గా సెంటర్ వద్ద మొహర్రం వేడుకలను వైభవంగా నిర్వహించారు. యువకులు పీర్లను చేతబట్టి ఇంటింటికి వెళ్లి దక్షణ స్వీకరించారు. దర్గా కమిటీ సభ్యులు నజీర్, అహమ్మద్ అలీ, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండలంలోని సీతారామపురం, తురకపాళెం, ఎగువపాళెం, నారాయణప్పపేట, తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడిల్లో కొలువుదీరిన పీర్ల వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు.

సోమశిల: అనంతసాగరం మండలంలో మొహర్రం వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లోని పీర్లచావిడిల్లో పీర్లను ప్రతిష్టించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి అగ్నిగుండ మహోత్సవం నిర్వహించనున్నారు.

మర్రిపాడు: మండలంలోని నందవరంలో మొహర్రం వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి పెద్ద పీర్ల ఊరేగింపును నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు మొక్కుకుని అగ్నిగుండం తొక్కి భక్తిని చాటారు.

నేటి నుంచి మొహర్రం వేడుకలు

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో ఆదివారం నుంచి మొహర్రం వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాతో పాటు పలు ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా మొహర్రం సందర్భంగా నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగకు వచ్చే భక్తులు ఏఎస్‌పేట దర్గాను సందర్శించడం ఆనవాయితీ. భక్తుల కోసం ఏఎస్‌పేట దర్గాలో అన్ని వసతులు కల్పించినట్లు దర్గా ఈఓ హుస్సేన్ తెలిపారు. దర్గా ప్రాంతంలో భక్తులు సజావుగా దర్శనం చేసుకునేలా ఎస్సై సైదులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున వీరి కోసం దొరసానమ్మ తోటలో అన్ని సౌకర్యాలతో పాటు వాహనాలు నిలుపుకొనేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

కలిగిరిలో 393 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం 393 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 514 బేళ్లను తీసుకురాగా, 393 పొగాకు బేళ్లను విక్రయించామని, వివిధ కారణాలతో 121 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించినట్లుగా చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ. 221.84 ధర పలికిందని వివరించారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 522 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 522 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 790 బేళ్లు రాగా 522 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280 , కనిష్టంగా రూ.160, సగటున రూ.209 ధర పలికిందని వివరించారు. వేలంలో 9 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.